డబుల్ బెడ్ రూం లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

చెక్కులు అందజేసిన అనంతరం మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం

బాన్సువాడ, ఏప్రిల్ 13: నస్రుల్లాబాద్ మండలంలో డబుల్ బెడ్ రూం నిర్మించుకున్న లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూం ఇండ్ల బిల్లుల చెక్కులను రాష్ట్ర వ్యవసాయ సలహాదారుడు పోచారం శ్రీనివాస్ రెడ్డి బాన్సువాడ నియోజక వర్గ కేంద్రంలో ఆదివారం పంపిణీ చేశారు. నస్రుల్లాబాద్ మండలంలోని నలుగురికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ మాజీ అధ్యక్షుడు పెర్క శ్రీనివాస్, మాజీ సర్పంచ్ మోహన్, బాల్‌రాజ్, శ్రీనివాస్, మాజీ ఎంపీపీ విఠల్ తదితరులు పాల్గొన్నారు.

లెండి, నాగమడుగు ప్రాజెక్టు
పనులు త్వరగా పూర్తి చేయాలి

బిచ్కుంద(జుక్కల్), ఏప్రిల్ 13: జుక్కల్ నియోజకవర్గంలోని లెండి, నాగమడుగు ప్రాజెక్టు పనులు త్వరగా పూర్తిచేయాలని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతా రావు కోరారు. హైదరాబాద్ ఎర్రమంజిల్‌లోని జలసౌధాలో మంత్రి ఉత్తం కుమార్‌రెడ్డి అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నీటి పారుదల శాఖ సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కౌలాస్‌నాలా ప్రాజెక్టు, సింగితం రిజర్వాయర్ రిటర్నింగ్ వాల్, పెద్ద ఏడ్గి కాల్వ, బిచ్కుందలోని కమ్మరి చెరువు మరమ్మతుతోపాటు నియోజక వర్గంలోని చిన్న, పెద్ద చెరువుల పునరుద్ధరణ పనులు చేపట్టాలని మంత్రిని ఎమ్మెల్యే కోరారు. సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పాల్గొన్నారు.

వక్ఫ్ బిల్లు ఆమోదంపై నిరసన

లింగంపేట, ఏప్రిల్ 13: వక్ఫ్ సవరణ బిల్లు రద్దు ఆమోదం పొందడాన్ని నిరసిస్తూ మైనార్టీలు హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో లింగంపేటకు చెందిన పలువురు మైనార్టీలు పాల్గొన్నారు. వక్ఫ్ చట్టంతో ముస్లిములకు తీరని అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. మైనార్టీలకు వ్యతిరేకంగా మోడీ వక్ఫ్ బిల్లును తీసుకువచ్చారని అన్నారు. కార్యక్రమంలో మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఫిక్, మైనార్టీ సెల్ లింగంపేట మండల అధ్యక్షుడు అఫ్రోజ్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 13: రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన ఘటన ఆదివారం ఎల్లారెడ్డిలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అన్నాసాగర్ గ్రామానికి చెందిన బాలరాజు కూతురు భావనను తీసుకొని బైక్‌పై కామారెడ్డికి బయల్దేరాడు. తిమ్మారెడ్డి గ్రామ శివారులో ఉన్న రామలింగం బాయి వద్ద బైక్ అదుపుతప్పడంతో కల్వర్టు కింద పడిపోయారు. దీంతో బాలరాజు ముఖం, కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. భావనకు చిన్నపాటి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు క్షతగాత్రులను ఎల్లారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఆరోగ్యంపై ఆందోళన అవసరం లేదని వైద్యులు తెలిపారు.

పుల్కల్, పెద్దకొడప్‌గల్‌లో ఏర్పాటుచేసిన జొన్నల కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్న సొసైటీ చైర్మన్లు రామకృష్ణారెడ్డి, హన్మంత్‌రెడ్డి

బిచ్కుంద/ పెద్ద కొడప్‌గల్, ఏప్రిల్ 13: బిచ్కుంద మండలంలోని పుల్కల్ గ్రామంలో ఏర్పాటుచేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ చైర్మన్ రామకృష్ణారెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం క్వింటాలు జొన్నలకు రూ.3,300 మద్దతు ధరను ప్రకటించి, కొనుగోలు చేస్తున్నదని చెప్పారు. రైతులు జొన్నల కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ సీఈవో సాయిప్రకాశ్, రేఖవార్ సుభాష్, సంఘం డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు. పెద్దకొడప్‌గల్‌లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ హన్మంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎకరానికి 8.65క్వింటాళ్ల వరకు జొన్నలు కొనుగోలు చేయనున్నట్లు చెప్పారు. కార్యదర్శి సందీప్, నాయకులు మహేందర్‌రెడ్డి, మోహన్, డైరెక్టర్లు, ఏఈవోలు రూప, రాజ్యలక్ష్మి, సిబ్బంది సంజీవులు, నర్సింహులు, రైతులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 13: ఎన్నో ఏండ్ల అనంతరం కలుసుకున్న ఆ మిత్రు ల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఎల్లారెడ్డి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 30ఏండ్ల క్రితం పదో తరగతి చదువుకున్న వారందరూ ఒకేచోట కలిశారు. 1994-95 సంవత్సరంలో ఎస్సెస్సీ పూర్తిచేసిన వారు ఎల్లారెడ్డిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు సరదాగా గడిపారు. ఉదయం కార్యక్రమం ప్రారంభం కాగానే 'ఏంరా రాజు.. అట్లనే ఉన్నావ్..! అవునురా సీను నువ్వయితే మస్తు మారిపోయినవ్..:' అనే పలుకరింపులతో సమ్మేళనం ఆనందంగా మొదలైంది. ఉన్నత చదవుల కోసం మరో గ్రామానికి వెళ్లిన వారు కొందరైతే.. కుటుంబం మరో పట్టణానికి వలస వెళ్లడంతో అక్కడికి వెళ్లన వారు మరికొందరు. ఉద్యోగం, వ్యాపారాలు చేసుకుం టూ ఎక్కడెక్కడో స్థిర పడిన వారందరూ ఒకే వేదిక పై కలుసుకొని రోజంతా మధుర స్మృతులను పోగుచేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులను చెప్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఎంతో కష్టపడి అప్పటి మిత్రబృందాన్ని కలిపి కార్యక్రమాన్ని నిర్వహించిన రమేశ్‌గౌడ్, దేశ్‌పతి కృష్ణ, వెంకట్‌రమణకు స్నేహితులందరూ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి మున్సిపల్ మాజీ చైర్మన్ పద్మ శ్రీకాంత్, ఐఈఆర్పీ వెంకటేశం, పంతంగిరాజు, ఫైర్ ఉద్యోగి షేక్ సలాం, అవుసుల సంతోష్, గూడ తిరుపతి, యూనుస్, ప్రభు, యశ్వంత్‌రావు, హఫీజ్ పటేల్, కృష్ణ, రాంగారి దత్తు తదితరులు పాల్గొన్నారు.

మాతృశ్రీ జూనియర్ కాలేజీ విద్యార్థులు..

రామారెడ్డి (సదాశివనగర్), ఏప్రిల్ 13: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మాతృశ్రీ జూనియర్ కాలేజీలో 1998-2000 బ్యాచ్‌నకు చెందిన ఇంటర్ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు. సదాశివనగర్ మండలం పద్మాజీవాడిలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు. 25 సంవత్సరాల అనంతరం ఒకే వేదికపై అందరూ కలుసుకొని తమ మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు పాఠాలు నేర్పిన అధ్యాపకులకు శాలువాలు కప్పి, జ్ఞాపికలను అందజేశారు. సమాజ సేవ చేస్తామని తీర్మానించుకున్నారు. కార్యక్రమంలో 25మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న 1994-95 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు

పద్మాజివాడిలో సమావేశమైన 1998-2000 ఇంటర్ బ్యాచ్ మాతృశ్రీ జూనియర్ కాలేజీ విద్యార్థులు

పాఠశాలకు పూర్వ విద్యార్థుల సహాయం

కామారెడ్డి, ఏప్రిల్ 13: జిల్లాకేంద్రంలోని పీవీపీ ఓరియంటల్ పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులకు ఆదివారం ఆర్థిక సహాయం అందజేశారు. పాఠశాలలో 1993-94 విద్యా సంవత్సరంలో ఎస్సెస్సీ చదివిన విద్యార్థులు తమ వంతుగా పాఠశాల కోసం రూ.1,21,000 పాఠశాల ఉపాధ్యాయులకు అందజేశారు. పాఠశాల పూర్వ ప్రధానోపాధ్యాయులు మురళీరెడ్డి, సుధాకర్, పూర్వ ఉపాధ్యాయులు భాస్కర్, శర్మకు శాలువాలు కప్పి సత్కరించారు.

ఆర్థిక సహాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

ఇద్దరు పోలీసుల బదిలీ

బదిలీపై వెళ్తున్న పోలీసులను సన్మానిస్తున్న ఎల్లారెడ్డి సీఐ రవీందర్ నాయక్

లింగంపేట, ఏప్రిల్13: లింగంపేట పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించిన ఇద్దరు పోలీసులు బదిలీపై వెళ్లినట్లు ఎస్సై వెంకట్‌రావు తెలిపారు. సిబ్బంది రాజయ్య కరీంనగర్ జిల్లాకు బదిలీ కాగా శంకర్ సైబరాబాద్‌కు ట్రాన్స్‌ఫర్ అయినట్లు చెప్పారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎల్లారెడ్డి సీఐ రవీందర్ నాయక్ బదిలీపై వెళ్తున్న సిబ్బందికి శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఎస్సై వెంకట్‌రావు, ఏఎస్సై ప్రకాశ్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సమాజసేవలో పాల్గొనడం అదృష్టం

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 13: విద్యార్థి దశలో ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా సమాజసేవలో పాల్గొనడం ఎంతో అదృష్టమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని హాజీపూర్ తండాలో ఎన్ఎస్ఎస్ యూనిట్-1 వలంటీర్లు నిర్వహిస్తున్న శిబిరం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిబిరాల ద్వారా విద్యార్థుల్లో సేవా దృక్పథం పెరుగుతుందన్నారు. పలువురు వలంటీర్లకు ఆయన ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ చంద్రకాంత్, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

సర్టిఫికెట్లు అందుకున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

అగ్నిమాపక వారోత్సవాల గోడప్రతుల ఆవిష్కరణ

గోడప్రతులు ఆవిష్కరిస్తున్న ఎల్లారెడ్డి ఫైర్‌స్టేషన్ ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ వినోద్, మున్సిపల్ మాజీ చైర్మన్ పద్మ శ్రీకాంత్ తదితరులు

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 13: అగ్నిమాపక వారోత్సవాల గోడప్రతులు, కరపత్రాలను పట్టణంలోని అగ్నిమాపక కేంద్రంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో స్టేషన్ ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ వినోద్.. మున్సిపల్ మాజీ చైర్మన్ పద్మ శ్రీకాంత్‌తో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏప్రిల్ 14 నుంచి 20వ తేదీ వరకు వారం రోజులపాటు వారోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. అగ్నిప్రమాదాలు ఎలా అరికట్టాలి అనే అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. అగ్నిప్రమాదాలపై అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్ జంగం నీలకంఠం అప్ప, నాయకుడు మంచిర్యాల విద్యాసాగర్, అగ్నిమాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముతో వాహనదారులకు ఇక్కట్లు

వాహనం వెళ్లడంతో వస్తున్న దుమ్ము

బాన్సువాడ రూరల్, ఎప్రిల్ 13: జాతీయ రహదారి విస్తరణలో భాగంగా నిర్మిస్తున్న రోడ్డు పనులు వాహనదారులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. రోడ్డు నిర్మాణంలో భాగంగా పాత రోడ్డును తవ్వి కంకర వేసి వదిలేశారు. దీంతో ఈ రోడ్డు మీదుగా పెద్ద వాహనాలు వెళ్తున్న సమయంలో దుమ్ము, ధూళి ఎగిసి పడడంతో పలువురు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు. దుమ్ము లేవకుండా చర్యలు తీసుకోవాల్సిన కాంట్రాక్టర్లు పట్టించుకోకపోవడంతో ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల స్పందించి రోడ్డు నిర్మించే వరకు ట్యాంకర్లతో నీళ్లు పట్టించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

హోరాహోరీగా సాగిన కుస్తీ పోటీలు

లింగంపేట/ బాన్సువాడ, ఏప్రిల్ 13: లింగంపేట మం డలం లింగంపల్లి గ్రామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన కుస్తీ పోటీలు హోరాహోరిగా సాగాయి. హనుమా న్ జయంతి ఉత్సవాల్లో భాగంగా వీడీసీ ఆధ్వర్యంలో కుస్తీ పోటీలు నిర్వహించారు. పోటీల్లో పాల్గొనడానికి బాన్సువాడ, గాంధారి, ఎల్లారెడ్డి, మహారాష్ట్ర, కర్నాటక తదితర ప్రాంతాల నుంచి మల్లయోధులు తరలివచ్చారు. కొబ్బరి కాయ కుస్తీ మొదలు కొని 500, వెయ్యి రూపాయల నగదుతోపాటు రెండు తులాల వెండి కడియం వరకు పోటీలు నిర్వహించారు. పోటీల సందర్భంగా స్థానిక పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

లింగంపల్లిలో తలపడుతున్న మల్లయోధులు

బాన్సువాడ మండలంలోని దేశాయిపేట్ గ్రామంలో నిర్వహించిన కుస్తీ పోటీల్లో మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల నుంచి వచ్చిన మల్లయోధులు తలపడ్డారు. బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని పోటీలను తిలకించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం బీర్కూర్ మండలం రామాలయ రథోత్సవంలో పోచారం పాల్గొన్నారు.

దేశాయిపేటలో తలపడుతున్న మల్లయోధులు

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

PASSPORT LOST

★MUDDU UDAY KUMAR S/O MUDDU GANGADHAR R/O. H.NO.2-62/A, VILL:DEGAON, ALOOR (MDL), DIST. NIZAMABAD. నా యొక్క పాస్‌పోర్ట్ నెం. P7713818 గలది. నేను ఇళ్ళు మార్చినప్పుడు ఎక్కడో పడిపోయినది. ఎవరికైన దొరికినచో సంప్రదించు సెల్ నెం.9966532554.
NTZ - 338433

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా వివారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

రుణాలను ఆదాయాభివృద్ధికి వినియోగించుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం సాయిలు

రాజంపేట్, ఏప్రిల్ 13: మహిళా సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలు ఆదాయాభివృద్ధికి వినియోగించుకోవాలని ఇందిరా క్రాంతి పథం ఏపీఎం సాయిలు సూచించారు. రాజంపేటలోని గ్రామ సంఘం కార్యాలయంలో లలిత అధ్యక్షతన ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం సాయిలు, సీసీ శ్రీనివాస్ మాట్లాడుతూ.. చిన్న సంఘాల సమావేశాలు సక్రమంగా నిర్వహించాలన్నారు. మొండి బకాయిలు రికవరీ చేయాలని సూచించారు. విద్యార్థుల యూనిఫామ్స్ కుట్టడం కోసం అనుభవం ఉన్న సభ్యుల పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కొత్త వారిని సంఘాల్లో చేర్పించాలన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రాజంపేట గ్రామ సంఘంలోని 102 సంఘాలకు రూ5.78 కోట్ల రుణాన్ని ఇప్పించినట్లు తెలిపారు. బ్యాంకు లింకేజీ, శ్రీనిధి లక్ష్యాలు 100 శాతం సాధించడంపై వీవోఏలు, గ్రామ సంఘ అధ్యక్షులను అభినందించారు. కార్యక్రమంలో వీవోఏ అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

మురికి కాలువలను శుభ్రం చేయించండి సారూ..!

డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్త

సంగోజీపేట్‌లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం

బాన్సువాడ రూరల్, ఏప్రిల్ 13: డ్రైనేజీల్లో చెత్తా చెదారం నిండి మురికి నీరు నిల్వడంతో దుర్వాసన వస్తున్నదని, మురికి కాలువలను శుభ్రం చేయించి రోగాల బారిన పడకుండా చూడాలని బాన్సువాడ మండలంలోని సంగోజీపేట్ గ్రామస్తులు అధికారులను వేడుకుంటున్నారు. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. మురికి నీరు నిలువతో దుర్వాసన వ్యాపిస్తున్నదని గ్రామస్తులు వాపోతున్నారు. మురికి కాలువలను శుభ్రం చేయించాలని గ్రామ పంచాయతీ అధికారులను వేడుకున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీలను శుభ్రం చేయకపోవడంతో మురికి నీరు నిలువ ఉండి దోమల బెడద ఎక్కువైందని, రోగాల ప్రభలే అవకాశం ఉన్నదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో మురికి కాలువలను శుభ్రం చేయించాలని కోరుతున్నారు.

రేపు బాన్సువాడలో బీఆర్ఎస్‌లోకి చేరికలు

బాన్సువాడ, ఏప్రిల్ 13: బాన్సువాడలో మంగళవారం నిర్వహించనున్న బీఆర్ఎస్ పార్టీ సన్నాహక సమావేశంలో బీజేపీ, కాంగ్రెస్‌ల నుంచి పలువురు బీఆర్ఎస్ పార్టీలో చేరనున్నట్లు ఆ పార్టీ నాయకుడు, బాన్సువాడ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ షేక్ జుబేర్ తెలిపారు. బాన్సువాడలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకల్లో భాగంగా బాన్సువాలోని భారత్ గార్డెన్‌లో నిర్వహించనున్న సన్నాహక సమావేశానికి ఎమ్మెల్సీ కవిత, నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ముఖ్య అతిథులుగా హాజరవుతారని చెప్పారు. వరంగల్‌లో నిర్వహించనున్న రజతోత్సవ సభకు బాన్సువాడ నియోజకవర్గం నుంచి ఆరు వేల మందిని తరలించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. 40 బస్సులు, 150 తుఫాన్ వాహనాలు, 50 ఇతర వాహనాల్లో సభకు వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. బాన్సువాడ సభకు వస్తున్న కవిత, బాజిరెడ్డికి ఘన స్వాగతం పలుకనున్నట్లు తెలిపారు. తాడ్కోల్‌లోని శివాజీ విగ్రహం నుంచి బాన్సువాడలోని భారత్ గార్డెన్ వరకు బైక్ ర్యాలీ ఉంటుందని, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

అనారోగ్యంతో యువకుడి ఆత్మహత్య

విక్రం(ఫైల్)

లింగంపేట, ఏప్రిల్ 13: అనారోగ్యంతో బాధపడుతున్న యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటుచేసుకున్నది. మండలంలోని మల్లారం తండాకు చెందిన కెతావత్ విక్రం(26) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కామారెడ్డి, హైదరాబాద్‌లోని పలు దవాఖానల్లో చూయించుకున్న ఆరోగ్యం కుదుట పడలేదు. దీంతో శనివారం రాత్రి వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై వెంకట్‌రావు తెలిపారు. మృతుడి సోదరులు అశోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

నేడు రక్తదాన శిబిరం

లింగంపేట, ఏప్రిల్13: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని లింగంపేటలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు అంబేద్కర్ సంఘం మండల శాఖ అధ్యక్షుడు నీరడి సంగమేశ్వర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీ ఉంటుందని పేర్కొన్నారు. ర్యాలీ అనంతరం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఆలయానికి నగదు అందజేత

రామారెడ్డి, ఏప్రిల్ 13: మండలంలోని మద్దికుంట గ్రామంలో నెలకొన్న శ్రీ రేణుకాదేవి ఆలయ వార్షికోత్సవాన్ని త్వరలో నిర్వహించనున్నారు. ఇందు కోసం కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే, మాజీ ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ రూ.పదివేలు గ్రామ శాఖ నాయకుల ద్వారా గౌడ సంఘం సభ్యులకు అందజేశారు. కార్యక్రమం లో బీఆర్ఎస్ నాయకులు తోట రాజు, మార్కండేయులు, రాజేందర్ గౌడ్, బస్వాపురం లింబాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డివాసికి భారత్ విభూషణ్ అవార్డు

అవార్డు అందుకుంటున్న గోపాల్‌గౌడ్

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 13: పట్టణానికి చెందిన నంది అవార్డు గ్రహీత, ప్రముఖ చిత్రకారుడు చుక్క గోపాల్ గౌడ్‌ను భారత్ విభూషన్ అవార్డు వరించింది. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ, విజన్ నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్ వారి సౌజన్యంతో ఆదివారం ఏర్పాటుచేసిన ఉగాది కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్ రవీంద్రభారతిలో ఆయనకు భారత్ విభూషణ్ అవార్డు అందజేశారు. చుక్క గోపాల్‌గౌడ్‌కు భారత్ విభూషణ్ అవార్డు రావడంతో పట్టణ ప్రముఖులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

మైనర్‌ను వేధించినవారిపై కేసు

వినాయక్‌నగర్, ఏప్రిల్ 13: జిల్లాకేంద్రంలోని నాగారం ప్రాంతానికి చెందిన ఓ బాలికను హింసించి, వెట్టి చాకిరీ చేయిస్తున్న ఆమె తండ్రి, సవతి తల్లిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నట్లు ఐదో టౌన్ ఎస్సై గంగాధర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. షేక్ హుస్సేన్ మొదటి భార్య అహ్మదీ బేగం అనారోగ్యంతో మృతిచెందింది. వీరికి ఒక కూతురు (13 ఏండ్లు) ఉన్నది. తర్వాత రిజ్వానాను హుస్సేన్ రెండో పెండ్లి చేసుకున్నాడు. వీరికి ఇద్దరు సంతానం కలగడంతో మొదటి భార్య కూతురును నిత్యం వేధింపులకు గురి చేస్తున్నారు. బాలికను స్కూల్ మాన్పించి, ఆమెతో ఇంటి పనులు చేయిస్తూ, పాచిపోయే అన్నం పెట్టేవారని పేర్కొన్నారు. ఈనెల 8న బాలికను షేక్ హుస్సేన్, రిజ్వానా ఇద్దరూ కలిసి భైంసాలోని బాలిక బంధువుల ఇంటి ఎదుట పడేసి వెళ్లిపోయారు. దీంతో బాలిక మామ అయిన షేక్ హయాత్ ఆమెకు వైద్యం చేయించి శనివారం ఫిర్యాదు చేశాడు. దీంతో షేక్ హుస్సేన్, రిజ్వానా బేగంపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై గంగాధర్ వెల్లడించారు.

ఫ్యామిలీతో వెళ్తున్న కారు బోల్తా

వినాయక్‌నగర్, ఏప్రిల్ 13: కంఠేశ్వర్ బైపాస్ రోడ్డులో ఓ ఫ్యామిలీ ప్రయాణిస్తున్న కారు ప్రమాదవశాత్తు శనివారం రాత్రి బోల్తాపడింది. కేశాపూర్-మాధవనగర్ బైపాస్ రోడ్డు నుంచి కంఠేశ్వర్ బైపాస్ రోడ్డు చౌరస్తా వైపు వస్తున్న కారు అదుపుతప్పి బోల్తా పడడంతో అందులో ప్రయాణిస్తున్న మహిళలకు గాయాలయ్యాయి.